www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 1 ఆగస్టు 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



పంట నమోదును త్వరగా చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

రైతులు ఖరీఫ్ సీజన్ వరి సాగుకు సంబంధించి పంట నమోదులు త్వరగా చేసుకోవాలని వ్యవసాయ అధికారిని బి.మీనా అన్నారు. నవాబుపేటలో క్షేత్ర స్థాయిలో వరి పంటలను ఆమె సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. 2025 - 26 ఖరీఫ్ పంటలు నమోదులు జరుగుతున్నాయన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు తోటి సంబంధిత రైతు భరోసా కేంద్రానికి వెళ్లి గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. దీంతో మీరు పండించిన ధాన్యాన్ని ఆన్లైన్ ద్వారా రైస్ మిల్లర్లకు విక్రయించుకుని నగదు పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏ దీప్తి, రైతులు పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న ఎఒ మీనా

లొల్ల...లాకులు డొల్ల

- శిథిలావస్థలో లాకులు గేట్లు
- వరదతో పొంచి ఉన్న ప్రమాదం
- పునర్నిర్మాణానికి నోచుకోని వైనం
- రూ.77 కోట్ల ప్రతిపాదనకే పరిమితం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

జిల్లాలోని 16 మండలాలలో రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు, తాగునీరు అందించే లొల్లలాకుల భవిత ప్రశ్నార్థంగా మారింది. గోదావరి మధ్య తేడా ప్రధాన కాలువ పరిధిలోగల ఆత్రేయపురం మండలంలోని లొల్ల గ్రామం పరిధిలో 1886 సంవత్సరంలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వంలో కాటన్ దొర నిర్మించిన ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్, గన్నవరం, అమలాపురం జంట లాకులు శిథిలావస్థకు చేరడంతో పాటు శ్లాబ్ అడుగు భాగాన పెచ్చులు ఊడి ఊచలు బయటపడ్డాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. బొబ్బర్లంక మధ్య డెల్టా ప్రధాన కాలువ నుంచి లొల్ల లాకులు వద్ద, ముక్తేశ్వరం, గన్నవరం, అమలాపురం కాలువల మీదుగా కోనసీమ జిల్లాలోని 16 మండలాలలో గ్రామాల పరిధిలోగల పంట పొలాలకు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ లాకులను పునర్నిర్మించేందుకు రూ.77 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో కార్యరూపం దాల్చడం లేదు. దీంతో శిథిలావస్థకు చేరిన లాకుల ద్వారానే రైతులకు సాగునీటిని అందిస్తున్నారు. లాంచీలు, పడవలు వెళ్లే మార్గం తలుపులు కూడా పాడైపోవడంతో లాకుల పరిస్థితి మరి దయానియంగా మారింది. సుమారు 20 సంవత్సరాల నుంచి ఈ దుస్థితి ఏర్పడింది. ఈ లాకుల తలుపులకు మరమ్మతులు చేయడానికి సైతం మెయింటినెన్స్ నిధులు కూడా మంజూరు కాకపోవడంతో జలవనల శాఖ అధికారులకు భారంగా మారింది. గన్నవరం, అమలాపురం జంట లాకుల పరిస్థితి మరి దయనీయంగా మారింది. సుమారు ఈ లాకులు నిర్మించి 140 సంవత్సరాలు కావొస్తోంది. జల వనరుల శాఖ అధికారులు లాకులను పునర్నిర్మించేందుకు ప్రతి సంవత్సరం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నత అధికారులకు నివేదిస్తున్న నిధులు మంజూరు చేయకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. దీంతో రైతులు లాకులకు ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు ఆందోళన చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన లాకులపై భారీ వాహనాలను సైతం నిషేధించారు. గన్నవరం అమలాపురం జంట లాకులపై భారీ వాహనాలను వెళ్లకుండా గతంలో గడ్డర్లను ఏర్పాటు చేస్తే వాటిని సైతం తొలగించారు. ఎంతోమంది కలెక్టర్లు ఈ లాకులను సందర్శించి లాకుల వ్యవస్థను పరిశీలించడానికి వచ్చినప్పుడు రైతులు కలెక్టర్లకు లాకుల వ్యవస్థ గురించి చెప్పి పునర్నిర్మించాలంటూ కలెక్టర్లకు చెప్పిన సందర్భాలు లేకపోలేదు. నియోజకవర్గ టిడిపి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అసెంబ్లీ సమావేశాల్లో లాకుల ప్రస్తావన తీసుకొచ్చి కోనసీమ జిల్లాలోని 16 మండలాల గ్రామాలలో పంట పొలాలకు సాగునీటికి ఆటంకం కలగకుండా ఉండేందుకు పునర్ నిర్మించాలంటూ సభాపతికి విన్నవించారు. ఇటీవల లాకులను సందర్శించిన గోదావరి రివర్ మేనేజ్మెంట్ మెంబర్ ఆఫ్ సెక్రటరీ ఆర్‌కె.కనోడియాకు శిథిలావస్థకు చేరిన లాకుల వ్యవస్థ గురించి జలవనరుల శాఖ అధికారులు ఆయనకు వివరించారు.



అమలాపురం, గన్నవరం జంట లాకులు(ఇన్‌సెట్)లో ముక్తేశ్వరం బ్యాంక్ కెనాల్



లాకుల స్లాబ్ అడుగుభాగాన దుస్థితి

మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు కూడా ప్రభుత్వం పెంచాలని మిడ్డే మీల్స్ జిల్లా కన్వీనర్ లోవలక్ష్మి డిమాండ్ చేశారు. అమలాపురం మండల కమిటీ సిఐటియు ఆఫీస్ వద్ద గురువారం జిల్లా కన్వీనర్ లోవలక్ష్మి అధ్యక్షతన మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కన్వీనర్ లోవలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న పిల్లలకి వండి పెట్టే మెను మారుతున్నప్పటికీ మేం పెట్టే పెట్టుబడులు గాని జీతాలు గాని నెల నెల పడట్లేద న్నారు. మూడు నెలలకు ఒకసారి నాలుగు నెలలకు ఒకసారి మాత్రమే పెట్టుబడి డబ్బులు వస్తున్నాయ న్నారు. అవి కూడా పూర్తిస్థాయిలో రావడం లేదని నెలకు ఎంత పెట్టుబడి అయితే పెడుతున్నామన్నారు. నెలకు రావలసినది పూర్తిస్థాయిలో అకౌంట్ కి రావట్లేదని పని భారం పెరిగిందని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు కూడా ప్రభుత్వం పెంచాలని రోజంతా కష్టపడి పని చేస్తే ఒక మధ్యాహ్నం భోజనం కార్మికురాలికి రోజుకి రూ.100 మాత్రమే కిడుతుందని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. అలాగే గ్యాస్ ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏడుగురు తో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. నూతన కమిటీలో అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.లోవలక్ష్మి, జె.సత్యనా బరాయణ , కోశాధికారి గోవిందరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎంవి.రవణ, జాయింట్ సెక్రెటరీ సుబ్బలక్ష్మి, దుర్గ, భవాని కమిటీ సభ్యులుగా నూతన కమిటీ ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న లోవలక్ష్మి

బోధనేతర పనులు మినహాయించాలి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని, బోధనను హరించే యాప్ లను పూర్తిగా రద్దు చేయాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎంటివి ఎఎస్.సుబ్బారావు,సెక్రటరీ జనరల్ పోతంశెట్టి దొరబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని వారు అన్నారు.



యుటిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా

2న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘ ఇచ్చిన పిలుపుమేరకు విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారానికై ఆగస్టు 2న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా విజయవంతం చేయడానికి గురువారం యుటిఎఫ్ హోమ్‌లో ముందస్తు ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలన్నారున. అనేక రూపాలలో అనేక సార్లు ఉద్యమాలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడంతో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘ పిలుపుమేరకు ఈనెల 2వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని అన్నారు. ఈ ధర్నాకు ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. పలు డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో పెంకే వెంకటేశ్వరరావు(యుటిఎఫ్), సరిదే సత్య పల్లంరాజు (ఎస్‌టియు), గిడ్డి వివి.సత్యనారాయణ (ఎపిటిఫ్ 1938), సిరాజ్ (ఎపిటిఎఫ్ 257), షబ్బీర్ హుస్సేన్ (ఎపిపిటిఎ) జి వి.రమణ, దుర్గా ప్రసాద్, జి.రవి, జి. వెంకటేశ్వరావు, పెన్నాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో డెంగీ నిర్మూలన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రతి ఒక్కరూ డెంగ్యూ వ్యాధిపై అవగహన, అప్రమత్తత కలిగి ఉండటం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ దుర్గారావు దొర పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో సబ్ యూనిట్ అధికారులు రాజ్ కుమార్, రామారావు ఆధ్వర్యంలో గురువారం జరిగిన డెంగీ మాసోత్సవ ముగింపు ర్యాలీని జిల్లా వైద్యాధికారి జెండా ఊపి ర్యాలిని ప్రారంభించారు. ఈ ర్యాలీ జమున్సిపల్ కార్యాలయం సెంటర్ వరకు సాగింది. అనంతరం పోలీస్ స్టేషన్ సెంటర్ లో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయం సమావేశపు హాలు నందు డెంగీ వ్యాధిపై జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ దుర్గారావు దొర మాట్లాడారు. కార్యక్రమంలొ వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చిన వైద్య అధికారులు, సిబ్బంది తో పాటు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర

పింఛన్ల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

బయోమెట్రిక్ విధానంలో వేలిముద్రలు పడక పోవడంతో పింఛన్ తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కాట్రేనికోన ఎంపిడిఒ ఎస్.వెంకటాచలం తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఇక నుంచి ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆగస్టు నుంచే ఈ కొత్త విధానం అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. కాట్రేనికోన మండల పరిధిలోని 10,251 మందికి రూ.4కోట్ల 46 లక్షల యాభై రెండు వేల 500 విడుదల చేశామన్నారు. గురు వారం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శిలు పింఛన్ నగదును బ్యాంక్ నుండి తీసుకుని ఆయా సచివాలయం సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

192 కొత్త పింఛన్ల మంజూరు

ఆలమూరు: మండల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన పలువురికి 192 కొత్త పెన్షన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ ఎ.రాజు గురువారం తెలిపారు. అయితే ఈ మంజూరైనవన్నీ కూడా భర్త మరణిస్తే భార్య కు వచ్చినవే అన్నారు. వీటిల్లో ఒకటి మాత్రం ఆలమూరులో కిడ్నీ బాధితులకు రూ.10 వేలు మంజూరయ్యాయన్నారు. మిగిలిన వారందరికీ నాలుగు వేలు చొప్పున శుక్రవారం పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు. కొత్తగా మంజూరైన పింఛన్లకు రూ.7 లక్షల 74వేలు విడుదలైనట్లు ఆయన తెలిపారు. గ్రామాల వారిగా మంజూరైన పింఛన్ల వివరాలు ఆయన తెలిపారు.

కార్టూ'నిజం'



ఎరువుల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామం లో డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ కార్యాలయంలో రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎడిఎ నాగ కుమార్ మాట్లాడుతూ రైతులు పండించే పంటకు అధిక మోతాదులో ఎరువులు, పురుగుమందుల వాడకం వలన భూమిలో సూక్ష్మ జీవులు నశించడం, అదే ఆహారాన్ని తినడం వలన అనారోగ్యాలకు గురికావడం జరుగుతుందని, రైతులు తమ సాగుచేసే పంటలో కొంత భూమిలో ప్రకృతి వ్యవసాయం చేసి రాబోవు తరాలకు మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందజేయాలన్నారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం పొందిన రాజశేఖర్, నందకిషోర్ రైతులకు వ్యవసాయంలో అవలంబించే తగు జాగ్రత్తలు, సూచనలను తెలియజేశారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత వాటి ద్వారా మనకి సహాయపడే పోషకాల గురించి వివరించారు. ఎఒ మనోహర్ నానో యూరియా, నానో డిఎపి పిచికారీ చేసుకోవడం వలన తక్కువ ఖర్చుతో ఎక్కువ వథా కాకుండా మొక్కకి నేరుగా అందుతుందని తెలిపారు. అదేవిధంగా మండల వ్యవసాయ అధికారి టి.మణిదీప్ రైతులందరూ కూడా చెప్పిన విషయాలను పాటిస్తూ వ్యవసాయ రంగాన్ని, ప్రకృతి వ్యవసాయం పద్ధతులను పాటించి ఆరోగ్యకరణమైన పంటలు పండించాలని విజ్ఞప్తి చేశారు. రైతులందరూ మెరుగైన వ్యవసాయ పద్ధతులు పాటించాలని ఆరోగ్యకరమైన చిరుధాన్యాలను ఆహారంగా ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ.ప్రవీణ్ కుమార్, వై మంజు ప్రవళిక, వి కళ్యాణ్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చేసిన సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - అంబాజీపేట

ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలు ప్రజలలో గుర్తింపునిస్తాయని ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యులు బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సబార్డినేటర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ గుత్తుల సాయికృష్ణ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా గుత్తుల సాయికృష్ణ, గౌరీలక్ష్మి దంపతులను గురువారం ఘనంగా సన్మానించారు. ఎంపిపి అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంపిడిఒ ఎపిఎల్.లక్ష్మీనరసింహం, పలువురు మాట్లాడుతూ వేరు వేరు ప్రాంతాలలో 41 ఏళ్లపాటు చేసిన సాయికృష్ణ సేవలను ఆ ప్రాంత ప్రజలు ఎల్లప్పుడూ గుర్తించుకుంటారన్నారు. సాయికృష్ణకు ఎంపిటిసి సభ్యులు, సహోద్యోగులు పూలమాలలు వేసి శాలువా కప్పి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. వీరు భవిష్యత్తులో సమాజానికి సేవలందిస్తూ ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి ఎంపిడిఒ జివి.సరోవరరావు, డిప్యూటీ ఎంపిడిఒ కె.శ్రీనివాస్, ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, వైస్ ఎంపిపి నేతల నాగరాజు, ఎంపిటిసి సమాఖ్య ముత్తాబత్తుల ప్రశాంత్, పబ్బినీడి రాంబాబు, విత్తనాల ఇంద్రశేఖర్, నాగవరపు నాగరాజు, ప్రజా ప్రతినిధులు, ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, మండల ప్రజా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ఆఫీసు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సాయి కృష్ణను సన్మానిస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ తదితరులు

సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం కామనగరువు గ్రామ సచివాలయం- 1,2లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించిన ఉద్యోగుల సేవలు అభినందనీయమని గ్రామ సర్పంచ్ నక్కా అరుణకుమారి ప్రశంసించారు. సాధారణ బదిలీల్లో భాగంగా వేర్వేరు గ్రామ సచివాలయాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు స్థానిక గ్రామపంచాయతీలో గురువారం సన్మాన సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అరుణ కుమారి అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు దుశ్శాల్వాలు కప్పి పూలమాలలతో ఘన సత్కారం చేశారు. సర్పంచ్ తమకు బాగా సహకారాన్ని అందించారని, ఇప్పుడు బదిలీ పై వెళ్ళడం బాధగా ఉందని ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, వార్డు సభ్యులు చొల్లంగి శ్రీను, నాగేశ్వరరావు,నక్కా చంద్ర శేఖర్, కార్యదర్శి ఆర్ఎస్ఎస్.సూరపురాజు, రిటైర్డ్ కార్యదర్శి రాజా, జెఎబిసి ఆదినారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కామనగరువు లో సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మాలపాడు గ్రామంలో గురువారం నిర్వహించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాలపాడు లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రం కూడా అన్ని విధాల అభివద్ధి చెందుతుందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, పార్టీ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, శివ, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

విధుల్లో అలసత్వం వహించొద్దు

ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని, అధికారులు ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలనిమంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. గురువారం రామచంద్రపురం పట్టణంలోని ఒకటో వార్డులో ఉన్న టిడ్కో గహ సముదాయంలో అధికారులతో మంత్రి సుభాష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిట్కో గహాల్లో ఉన్న సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని అన్నారు. ముఖ్యంగా తాగునీరు కోసం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరగా మంచినీరు అందించాలన్నారు. అలాగే గృహ సముదాయాల్లో పారిశుధ్య పనులు, స్లాబ్ లీకేజీ పనులు, వాటర్ పైప్ లైన్లు తక్షణమే సరిచేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. టిడ్ కో గహ సముదాయంలో రేషన్ షాప్ పాయింట్ ఏర్పాటు చేసి నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది కొరత ఉంటే తాత్కాలిక పద్ధతిన నియమించుకునే అవకాశం చూడాలని సూచించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ అభివద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, డి శ్రీకాంత్, టిడ్కో ఎస్ఇ శేషగిరి, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఎంఎస్ఒ, సిఎల్‌టిసి బిందు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న మంత్రి సుభాష్

మెప్మా బజార్‌లతో ఆర్థిక ప్రగతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించడానికి మెప్మా అర్బన్ బజార్లు ఎంతో దోహదం చేస్తాయని నగర పంచాయతీ కమిషనర్ పి.రవి వర్మ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ బజార్ ను గురువారం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేసి, మెప్మా లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు చేతి వృత్తులలో తయారు చేసిన ఉత్పత్తులను అర్బన్ బజార్ ద్వారా విక్రయించడం జరుగుతుందన్నారు. స్వయం సంఘాల మహిళల ఆర్థిక అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను తయారు చేసి అమ్మకాలు చేయడం ద్వారా మంచి లాభాలను పొందవచ్చునన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్ లో చీరలు, పంజాబీ డ్రెస్సులు, పచ్చళ్ళు, తినుబండారాలు, జ్యూట్ బ్యాగులు, ఫ్లవర్ వాజ్‌లు, కొవ్వొత్తులు, పేపర్ ప్లేట్లు, ఆర్గానిక్ ప్రొడక్ట్స్ తదితర స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, నగర పంచాయతీ ఎఇ కె.శ్రీనివాస్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ (సిఎంఎం) ఎస్.భాస్కర్, కో ఆర్డినేటర్ దేవకీ దేవి, ఆర్‌పిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



నగర పంచాయతీలో ఏర్పాటుచేసిన మెప్మా బజార్

రావులపాలెం పిఎసిఎస్ అధ్యక్షునిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - రావులపాలెం

మల్లిడి తిరపయ్యగారి వెంకటరెడ్డి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) ఛైర్మన్‌గా కెవి.సత్యనారాయణ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిమాన్ కమిటీ అధ్యక్షుడుగా సీనియర్ రాజకీయ నాయకుడు మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కెవి. సత్యనారాయణరెడ్డి గురువారం పదవి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సంరద్భంగా ఆయనను కమిటీ సభ్యులుగా దాసరి శీను, జక్కంపూడి నాని. బాధ్యతలు స్వీకరించారు. నూతనకమిటీ సభ్యులను పలువురు కూటమి నాయకులు జక్కంపూడి వెంకటస్వామి చిలువూరి సతీష్ రాజు, తమనంపూడి రామకృష్ణారెడ్డి, కొప్పిశెట్టి ప్రసాద్, గుత్తుల రాంబాబు, పోతంశెట్టి కనికి రెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి తదితరులు అభినందించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కెవి సత్యనారాయణరెడ్డి

వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

కేశవదాసుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన తాగునీటి ట్యాంకులను రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ గురువారం ప్రారంభోత్సవం చేశారు. ఎన్ఆర్ఐ యెనుమల వెంకటపతి రాజా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో వేసిన కేసు ద్వారా వెలువ నిధుల నుంచి కేశవదాసుపాలెం గ్రామంలో రూ. 21 లక్షల నిధులతో 20 వేల లీటర్ల ట్యాంకును నిర్మించారు. దీన్ని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ప్రారంభించి, ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారు, ఈ సందర్భంగా నిధులు రాకకు కారకులైన వైవి.రాజాను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి వీరా మల్లిబాబు, సర్పంచ్ మేడిన్ సరోజిని, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిఐకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు సర్కిల్ పరిధిలో ఒఎన్‌జిసి వెల్స్, రిగ్స్ ల వద్ద జరుగుతున్న దొంగతనాలు, నేరాలను సమర్థవంతంగా చేధించినందుకు సిఐ నరేష్ కుమార్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. విజయవాడలో జరిగిన అన్‌షోర్ సెక్యూరిటీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఈపురస్కారం అందుకున్నారు.



పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రామచంద్రపురం ఆర్‌డిఒ డి.అఖిల వైద్య సిబ్బందిని ఆదేశించారు. అంగర పిహెచ్‌సిని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను, అవుట్ పేషెంట్ విభాగాన్ని, ల్యాబ్‌ని, ఫార్మసీ విభాగాన్ని తదితర వాటిని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఐవిఆర్‌ఎస్‌లో పేషెంట్ ఫీడ్ బ్యాక్ అన్ని విభాగాలకు సంబంధించి నూరు శాతం ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ పిఎన్ఎస్ డి.రత్నకుమారి, ఎంపిహెచ్ఇఒ జె. మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.రామారావు, హెల్త్ సూపర్‌వైజర్లు టి.మేరీ మణి, యం.నానిబాబు, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు-దొమ్మేరు రోడ్డు మార్గంలో యాదగిరి నూకరాజుకు చెందిన హోటల్లో చోరీకి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. వీరి నుంచి రెండు గ్యాస్ సిలిండర్లను, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పట్టణానికి చెందిన ఎలుబండి నాగదుర్గా పవన్, ఎర్రంశెట్టి అంజి, దొమ్మేరుకు చెందిన గూడ పణిలను అరెస్ట్ చేశామన్నారు. వీరు కొవ్వూరుతో పాటు చాగల్లు, సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు మోటార్‌సైకిల్‌లను చోరీకి చేశారని తెలిపారు. నిందుతులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో నాలుగో వార్డ్ క్రిస్టియన్ పేటకు చెందిన చింతలపూడి శ్రీనివాస్(56) ఆర్థిక, అనారోగ్య ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గత కొంతకాలంగా శ్రీనివాస్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది బుధవారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు భార్య శ్రీదర్శిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. మతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి -తాళ్లరేవు

మండలం కోరంగి పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి 216పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నుండి యానం వైపు వెళ్తున్న కారు అమలాపురం నుండి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో కూర్చున్న మందపాటి సుభద్రయమ్మ (67) అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ సీట్‌లో ఉన్న ఆమె భర్త మందపాటి శ్రీరామరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రెప్పపాటులో కళ్ళ ఎదుటే భార్య మృతి చెందడంతో భర్త శ్రీరామరాజు దిగ్భ్రాంతికి గురయ్యాడు. సంఘటనా స్థలాన్ని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వెదురుముడిలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ బెల్లం సత్యనారాయణ కుటుంబ సభ్యులను గురువారం మండల వైసిపి నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మండలం కన్వీనర్ గూటం సత్యనారాయణ, వైస్ ఎంపిపి గుణ్ణం బాను ప్రసాద్, చోడే నాని బాబు, చొడే సూరిబాబు, రామకృష్ణ, గుత్తుల పుష్పలరావు, మేడిశెట్టి దుర్గారావు తదితరులు మతుని కుటుంబ సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కేంద్ర ప్రభుత్వం క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వయం ప్రతిపత్తి సంస్థ మై భారత్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో, మోహన్ డిగ్రీ కళాశాల సహకారంతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా యువజన అధికారి టి.గోపి మాట్లాడుతూ యువత ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని, పథకాలను అందిపుచ్చుకుని అభివద్ధి చెందాలను సూచించారు. ప్రిన్సిపల్ శ్రీరామ్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ రాజేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి- సామర్లకోట

ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పెదబ్రహ్మదేవంలో సొసైటీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పిఎసిఎస్ ఛైర్మన్ తోటకూర రాజకుమార్, డైరెక్టర్లు మలకల వెంకటేశ్వరరావు, బొల్లి రఘుతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శీను బాబు, టిడిపి మండల అధ్యక్షుడు ముసిరెడ్డి శ్రీరాములు, తోటకూర శీను పాల్గొన్నారు.

ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఉపాధ్యాయులంతా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ కోరారు. మండలంలోని చొల్లంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రమాణాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇది తన అభ్యర్థన గా భావించి ఎవరికివారుగా బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. అనంతరం ఆయన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్లో గురువారం 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రసాయన శాస్త్రంలో రసాయన చర్యలు, సమీకరణాల పాఠ్యాంశానికి సంబంధించి విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సమాచార హక్కు చట్టం-2005 పై జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం అమలాపురం మండలం రోళ్ళపాలెం ప్రకృతి వ్యవసాయ కార్యాలయం వద్ద అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ అవగాహనా సదస్సులో సమాచార హక్కు చట్టం హక్కుల విధి విధానాల గురించి ఉపయోగాలు, సక్రమంగా వినియోగించుకోవాల్సిన అంశాల గురించి వివరించారు. సమాచార హక్కు చట్టం అమలు గురించి చాటర్స్, సెక్షన్స్ గురించి వివరించి సిబ్బందికి అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ఏ ఏ శాఖలకు వర్తిస్తుంది వేటికి వర్తించదు తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సమీక్ష, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎంవివి.సత్యనారాయణ, మండల ఇన్‌ఛార్జి అప్పారి వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోళ్లపాలెంలో ఆర్‌టిఐ చట్టంపై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

చేసిన సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

సమాజానికి అందించిన సేవలే ఉపాధ్యాయునిగా మంచి గుర్తింపునిస్తాయని మండపేట ఎంఇఒ నాయుడు రామచంద్ర రావు, సోమిరెడ్డి అన్నారు. గురువారం కపిలేశ్వరపురం మండలంలోని వల్లూరు ఎంపిపి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం ముత్యాల మాణిక్యాంబ ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆమెను అధికారులు, సహచర ఉపాధ్యాయులు, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాణిక్యంబ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో సహకరించిన వారందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.


వల్లూరులో ఉద్యోగ విరమణ చేసిన మాణిక్యాంబకు సన్మానం


మండపేటలో ఎంఎల్ఎ వేగుళ్లను సత్కరిస్తున్న జెఎసి సభ్యులు

ఎంఎల్ఎ వేగుళ్లను సత్కరించిన జెఎసి

ప్రజాశక్తి - మండపేట

మండపేట పట్టణాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయడానికి అంగీకరిస్తూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం లో తీర్మానం చేసేందుకు సహకరించిన రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావును జేఏసీ సభ్యులు కలిసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. గురువారం మండపేట టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ వేగుళ్లను జెఎసి సభ్యులు ధూళి జయరాజు, కోన సత్యనారాయణ, మందపల్లి దొరబాబు, మల్లువలస గణపతి, సల్మాన్ హుస్సేన్, కరీం, ముమ్మిడివరపు నారాయణ, సుబ్రహ్మణ్యం, మద్దుల సుబ్బారావు, మోరంపూడి సూరిబాబు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.జరగాల్సిన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరారు.

ప్రజా సమస్యలపై కౌన్సిలర్ల ధ్వజం

ప్రజాశక్తి - సామర్లకోట


పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రోటోకాల్ విషయంలో అధికారులు నిబంధనలు పాటించ కుండా వ్యవహరిస్తున్నారని, పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్ల వ్యవస్థలు అధ్వానంగా పని చేస్తున్నాయని మున్సిపల్ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం ఇన్‌ఛార్జి మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల మరణించిన సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ మృతికి సంతాపం తెలిపారు. జీరో అవర్‌లో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊబా జాన్ మోజెస్ సహా మున్సిపల్ కౌన్సిలర్లు కరణం రాజకుమార్, ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ, పాగా సురేష్ కుమార్, యార్లగడ్డ జగదీష్ పాలిక కుసుమ, కాళ్ల శ్యామల, స్వయంభారపు వీరభద్రరావు, తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ వార్డుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి, శానిటేషన్ డ్రైన్ల నిర్వహణ లేక కంపు కొడుతుందని అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కెజె.రాజశేఖర్, ఆర్ఒ నూకరాజు, టిడిపి కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, కౌన్సిలర్లు సమస్యలపై మాట్లాడారు.

వైసిపి బిసి సెల్ మండల అధ్యక్షునిగా హరి

ప్రజాశక్తి - అంబాజీపేట

వైసిపి మండల శాఖ బిసి సెల్ అధ్యక్షులుగా మట్టపర్తి హరి నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి గురువారం ఆదేశాలు వచ్చాయని హరి తెలిపారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్ ఆదేశాల మేరకు తనను మండల శాఖ బీసీ సెల్ విభాగం అధ్యక్షులుగా నియమించారని తెలిపారు. తన నియామకమునకు సహకరించిన పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గన్నవరపు శ్రీనివాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు విత్తనాల చంద్రశేఖర్ కు సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.


మట్టపర్తి హరి


కేశవరం లో నూతన ఆలయ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం.

ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలి

ప్రజాశక్తి - మండపేట

ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి అన్నారు. మండపేట మండలం కేశవరంలో వేంచేసి యున్న గనిపోతు రాజు నూతన ఆలయ కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఆలయ కమిటీ ఛైర్మెన్‌గా ఆళ్ల రాజు తోపాటు కమిటీ సభ్యులు ఎనిమిది మంది తో వీర్రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మండపేట మండల టిడిపి మాజీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, మండల టిడిపి అధ్యక్షుడు కర్రి తాతారావు, పెనుమత్స రమేష్ రాజు, పిల్లా తాతాలు, ఉండమట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య విషయాలు తెలుసుకుంటున్న నగరం ఎంఎంసి ఛైర్మన్ లక్ష్మి

డైరెక్టర్ కుమారునికి ఎంఎంసి ఛైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి - పి.గన్నవరం

నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లూటుకుర్తి సత్యనారాయణ కుమారుడు సర్జరీ చేయించుకొని కె. ముంజవరం కటారులంక ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. వారిని నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, బాలరాజు గురువారం ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని పరామర్శించారు. వీరితో పాటు నగరం ఎఎంసి వైస్ ఛైర్మన్ గుడాల వెంకటరమణ, టిడిపి నాయకులు సంసాని పెద్దిరాజు, లంకే చిరంజీవి, అంచూరి రమేష్ తదితరులు కలిసి డైరెక్టర్ కుమారుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి

ప్రజాశక్తి - సామర్లకోట

పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ తొలుత రైల్వే స్టేషన్ బయట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయలకుం బాలం శ్రీనివాస్ మాట్లాడారు. జనరల్ బోగీలు పెంచాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఛార్జీలు తగ్గించాలని నిరసన వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యార్థం పాసింజర్ రైళ్లు అధికంగా నడపాలని, పాసింజర్ రైళ్లను రెగ్యులర్‌గా నడపాలని, ప్యాసింజర్ రైళ్లకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీల వసూళ్లను రద్దు చేయాలని, రైల్వే శాఖ తక్షణం ప్రజలకు మేలు కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలం శ్రీనివాస్, కరణం గోవింద్ రాజు, బాలం హరిబాబు, ఐటి వీరబాబు. కె.పవన్, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-కాకినాడ

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక అర్బన్ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ప్రాజెక్ట్ అధ్యక్షులు నీరజ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో యూనియన్ జిల్లా అధ్యక్షులు దడాల పద్మ, ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి, సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకట రమణ హాజరై మాట్లాడారు. సభ అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అర్బన్ ప్రాజెక్ట్ అధ్యక్షులుగా ఎం.విజయ, కార్యదర్శిగా ఐ.రాజేశ్వరి, కోశాధికారిగా కె.సరోజిని, ట్రిప్స్ సొసైటీ కార్యదర్శిగా జి.రమణమ్మ, ఉపాధ్యక్షురాలిగా జి.రామలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా ఎంకె.జ్యోతి, నీరజ, సత్యవతి, డి.మేరీ రత్నం, ప్రియ, వి.రమణ, ఈశ్వరి, ఎం.వసంత, ఆర్.లక్ష్మి, సిహెచ్.రామ, శ్రీదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమావేశంలో దళిత కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

దళిత వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని, వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని కౌన్సిలర్లు గంటా అప్పలస్వామి, బెండుకుర్తి సత్తిబాబు, ఇరుగుల యేసు మున్సిపల్ కమిషనర్ కనకారావును నిలదీశారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల గొల్లప్రోలు కౌన్సిల్ సమావేశం తిరస్కరించిన రూ.కోటి నిధులు నగర పంచాయతీకి ప్రత్యేక జిఒ ద్వారా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అభివృద్ధి పనులకు అనుమతి ఇచ్చారు. ఈ నిధుల్లో దళిత వార్డుల అభివృద్ధి పనులకు కేటాయింపులు లేవని, ఈ ఎజెండాలో ఒక్క రూపాయి కూడా ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. పట్టణంలో వీధిలైట్లు నిమిత్తం ఎజెండాలో రూ.ఐదు లక్షలు కేటాయించడంపై కౌన్సిలర్లు గంటా అప్పలస్వామి, గుళ్ళ సుబ్బారావు, జ్ఞానేశ్వరి అభ్యంతరం తెలిపారు.

భీమేశ్వరాలయంలో నిత్యాన్నదానానికి 15 ఏళ్లు

ద్రాక్షారామంలో ప్రతి రోజూ వెయ్యి మంది యాత్రికులకు అన్నదానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయంలో యాత్రికుల కోసం 2011లో అప్పటి ఇఒ కెఎన్‌విడివి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానాన్ని ప్రారంభించారు. ఈ నిత్యాన్నదానం ప్రారంభించి ఇప్పటికి 15 ఏళ్ల పూర్తయింది. భీమేశ్వరాలయానికి రాష్ట్ర నలుమూలల నుండి జిల్లా యాత్రికులు ఇక కార్తికమాసంలో అయితే వేలాదిమంది స్వామివారిని దర్శించుకుంటారు. వీటిని దృష్టిలో పెట్టుకుని అక్టోబర్ 2011లో ప్రారంభించిన నిత్యాన్నదానం దినదిన ప్రవర్తమానం చెందింది. మొదట్లో రోజుకి కేవలం వందమంది యాత్రికులు ఇక్కడ భోజనాలు చేసేవారు. ప్రస్తుతం ప్రతిరోజు 1000 నుంచి 1200 వరకు భక్తులు నిత్యాన్నదానంలో భోజనాలు చేస్తున్నారు. యాత్రికులు తాకిడి అధికంగా ఉండడంతో నిత్యాన్నదానాన్ని ఇక్కడ సోమవారం మండపం నుంచి బయట సుబ్బారెడ్డి అనే యాత్రికుడు నిర్మించిన ఆధునిక భవనంలో కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ యాత్రికులకు పులిహోర, ప్రసాదం, పప్పు, కూరగాయలు, పచ్చడి, సాంబారు, పెరుగుతో భోజనం వడ్డిస్తారు. స్వామివారి అన్నప్రసాదం స్వీకరించేందుకు నిత్యం యాత్రికులు తరలివస్తారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిత్య అన్నదానం కొనసాగుతుంది. ఇక ప్రతి రోజు కంటే శనివారం, ఆదివారం, సోమవారం మూడు రోజులు పాటు యాత్రికుల తాకిడి మరింత పెరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. కార్తీక మాసం నెలరోజుల పాటు స్వామివారి ఆలయానికి దేశ విదేశాల నుండి భక్తులు రావడం విశేషం. నిత్యాన్నదానానికి రూ 3.72 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి.స్వామివారి నిత్య అన్నదానానికి యాత్రికులు విరాళాలు ఇవ్వడంతో ఈ 15 సంవత్సరాలలోనూ. అవి రూ.3.72 కోట్లకు చేరుకున్నాయి. ఇక్కడ భోజనాలు చేసిన యాత్రికులు విరాళాలు భారీగా ఇవ్వడంతో స్వామివారి నిత్యా అన్నదాన పథకానికి నిధులు పెరుగుతూ వస్తున్నాయి. ముందు ముందు మరింతగా యాత్రికులు పెరిగే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎంత మంది వచ్చినా భోజనాలు పెడుతున్నాం

ప్రసిద్ధిగాంచిన ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయానికి నిత్యం జరిగే అన్నదానానికి ఎంత మంది యాత్రికులు వచ్చినా భోజనాలు పెడుతున్నాము. ఆలయానికి కార్తికమాసంలో శివరాత్రి సమయంలోను యాత్రికుల తాకిడి అధికంగా ఉంటుంది. యాత్రికుల మంచి రుచికరమైన భోజనం అందించేందుకు సిబ్బంది కృషి చేస్తారు.

- అల్లు వెంకట దుర్గా భవాని, ఇఒ


భోజనాలు చేస్తున్న యాత్రికులు

పరిశుభ్రమైన భోజనం అందిస్తున్నాం

నిత్యాన్నదాన పథకానికి వచ్చే వచ్చే యాత్రికులకు శుచి శుభ్రతతో కూడిన భోజనాలను వడ్డిస్తున్నాము. యాత్రికులకు రుచికరమైన భోజనం అందిస్తున్నాము. భీమేశ్వర స్వామి వారి పులిహోర ప్రసాదానికి మంచి డిమాండ్ ఉంది. ప్రతి రోజూ వెయ్యి మంది యాత్రికులకు పైగా నిత్యాన్నదానానికి వస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సాంప్ర దాయ పద్ధతిలో వంటకాలు వండి వడ్డిస్తున్నాము.

-గొల్ల కోట దేవి, ప్రధాన వంటకురాలు

విజయకుమారి సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-తాళ్లరేవు

ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయిని ములపర్తి విజయ కుమారి సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. గాడిమొగ హైస్కూల్లో గురువారం విజయ కుమారి ఉద్యోగ విరమణ సత్కార సభ హెచ్‌ఎం విజిటి.సునీత అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా నాయకులు గణేష్‌రావు, నగేష్, జెవివి నాయకులు కెఎంఎంఆర్.ప్రసాద్, యు.కొత్తపల్లి హైస్కూల్ హెచ్‌ఎం సురేష్ భూషణ్, రిటైర్డ్ హెచ్‌ఎం సత్య ప్రసాద్, హిందీ ఉపాధ్యాయిని సుమశ్రీ మాట్లాడారు. ఉపాధ్యాయిని సుమశ్రీ, పీడీ శ్రీనివాస్, ఎంఇఒలు ఉమా, మంగాయమ్మ, పాల్గొన్నారు.

ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్‌సిసి ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవాభావం పెంపొందుతుందని ఎన్‌సిసి డిప్యూటీ డిజి ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఈ నెల 25న ప్రారంభమైన ఎన్‌సిసి క్యాడెట్స్ శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు సహకరించిన శ్రీప్రకాష్ సినర్జీ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, కల్నల్ హెచ్ఎస్.మానిక్, మేజర్ మహమ్మద్ ఆసిస్, పాల్గొన్నారు.

నవోదయ కబడ్డీ పోటీల ముగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయలో మూడు రోజులపాటు నిర్వహించిన నవోదయ విద్యాలయాల ప్రాంతీయ కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. ముగింపు సభలో లలిత ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మట్టే ఆదిశంకర్, డాక్టర్ స్రవంతి ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. నవోదయ ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ ఆ ఈ పోటీల్లో 458 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.

ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి -కరప, యు.కొత్తపల్లి

విద్యుత్ ఛార్జీల నిలువు దోపిడీ ఆపి ప్రమాదకర అదానీ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కరపలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెట్టిన మీటర్లు తొలగించాలని, ఆగస్టు 5న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గ్రామ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘం నాయకురాలు సిహెచ్.రమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.వీరవేణి, ఆర్.వెంకటలక్ష్మి, ఎం.వరలక్ష్మి, సిహెచ్.వెంకటలక్ష్మి, బి.రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు, కెవివి.సత్యనారాయణ, సిహెచ్.సాంబశివకుమార్, జివిఎస్.రెడ్డి, ఎంఎల్ లిబరేషన్ నాయకులు జి.సత్యనారాయణ, జి.వినోద్, కె.కమలాకర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత రక్తదాన, వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించే ఈ కంటి వైద్య శిబిరంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో అందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి వారికి ఆపరేషన్లు చేస్తారన్నారు. అవసరమైన వారికి కళ్ళజోళ్లు, ఉచితంగా మందులు సరఫరా చేస్తారన్నారు.

వికలాంగుల హక్కులు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక బీచ్ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ ఆఫీసులో మల్టీ డిసబిలిటీ ప్రాజెక్టులో భాగంగా వికలాంగుల తల్లిదండ్రులకు వికలాంగుల యొక్క హక్కులు చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.నాయుడు మాట్లాడుతూ బహుళ వైకల్యం కలిగిన వ్యక్తులకు ప్రభుత్వం అనేక రకాల సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వికలాంగుల చట్టం 2016లో ఉద్యోగ అవకాశాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడం, ఉచిత పరికరాలు, ఉచిత విద్య, స్కాలర్షిప్ వంటి పథకాలను వివరించారు. మల్టీ డిజేబుల్ ప్రాజెక్టు ద్వారా ఉచితంగా ఇంటి వద్ద ఫీషియోథెరపి, న్యూట్రిషన్ ఫుడ్, ఒకేషనల్ ఆక్టివిటీస్ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ విజయదుర్గ, జి.సుశీల, స్కూల్ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.